

అధ్వానంగా అండర్ బ్రిడ్జిలు

ఉమ్మడి జిల్లా పరిధిలో జాతీయ రహదారి 44కు అనుబంధంగా నిర్మించిన అండర్ బ్రిడ్జిల నిర్వహణను గాలికొదిలేశారు.

- 8లో ▸



సంక్షేమం, అభివృద్ధిపై..

నిర్దేశిత లక్ష్యాల సాధనకు అధికారులు అంకిత భావంతో కృషి చేయాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి పేర్కొన్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
34.5 /23.1

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. ఆహ్లాదకరమైన గాలులు వీస్తాయి. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

చంద్రబాబు కోసం తెలంగాణకు అన్యాయం

- బీజేపీ, బాబు ఆడుతున్న నాటకంలో పావులా మారిన రేవంత్
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్‌: తన గురువు చంద్రబాబు మెప్పు కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణ ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నారని బాల్కొండ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు. బనకచర్ల ప్రాజెక్టు విషయంలో బీజేపీ, చంద్రబాబు కలిసి ఆడుతున్న నాటకంలో రేవంత్‌రెడ్డి పావులా మారాడన్నారు. శుక్రవారం ప్రశాంత్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. బనకచర్ల ప్రాజెక్టును ఎట్టిపరిస్థితుల్లో కట్టి తీరుతామని ఏపీ మంత్రి లోకేశ్ వ్యాఖ్యలు చేసినప్పటికీ రాష్ట్ర బీజేపీ నాయకులు, సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటివరకు స్పందించకపోవడంతో అసలు లోగుట్టు బయటపడిందన్నారు. బనకచర్ల విషయమై ఢిల్లీకి వెళ్లేది లేదని చెప్పిన రేవంత్‌రెడ్డి, రాత్రికి రాత్రి మనసు మార్చుకుని, ఇందుకు సంబంధించి వేసిన కమిటీని ఒప్పుకునేది లేదని చెప్పడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. మాయల ఫకీరు ప్రాణం చిలకలో ఉన్నట్లు ఓటుకు నోటు కేసులో నిందితుడిగా ఉన్న రేవంత్‌రెడ్డి జుట్టు బీజేపీ, చంద్రబాబు చేతిలో ఉందన్నారు. తనను తాను కాపాడుకునేందుకు రేవంత్‌రెడ్డి తెలంగాణకు తీరని అన్యాయం చేస్తున్నాడన్నారు. ఎట్టిపరిస్థితుల్లో తెలంగాణకు అన్యాయం చేసే బనకచర్ల ప్రాజెక్ట్‌ను అడ్డుకుంటామన్నారు. తెలంగాణ ప్రయోజనాల కోసం నిరంతరం పోరాడేది కేసీఆర్, బీఆర్‌ఎస్ మాత్రమేనన్నారు. బీజేపీ, చంద్రబాబు, రేవంత్ రెడ్డి కలిసి తెలంగాణకు చేస్తున్న అన్యాయంపై ప్రజలకు, ముఖ్యంగా యువతకు అవగాహన కల్పిస్తామన్నారు.

బందీ నుంచి విముక్తి

- ముగిసిన 'ఆపరేషన్ ముస్కాన్–11'
- జిల్లాలో 154 మంది బాలల గుర్తింపు
- 36 కేసులు నమోదు

ఖలీల్‌వాడి: బాలల రక్షణ, మానవ అక్రమ రవాణా నిరోధానికి చేపట్టిన 'ఆపరేషన్ ముస్కాన్' సత్ఫలితాలనిస్తోంది. ఆకలి, ఆర్థిక సమస్యలతో బాల కార్మికులు పెరుగుతున్నారు. దీంతో అధికారులు వారిని పనిలోంచి బయటికి తీసుకొచ్చి, తల్లిదండ్రుల చెంతకు చేరుస్తున్నారు. జిల్లాలో పోలీసులు, బాలల సంరక్షణ, కార్మిక శాఖ అధికారులు బృందాలుగా ఏర్పడి నిర్వహించిన తనిఖీలతో 154 మంది బాలలకు విముక్తి లభించింది.

తనిఖీలు ఇలా..

జిల్లాలో నిర్వహించిన 'ఆపరేషన్ ముస్కాన్–11' మూడు బృందాలు పనిచేశాయి. కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్, బోధన్, ఆర్మూర్ ఎస్సైలు ఇంచార్జీలుగా, నలుగురు కానిస్టేబుళ్లు, నలుగురు ఐసీడీఎస్, కార్మిక శాఖ అధికారులతో కలిసి కార్యక్రమాన్ని పూర్తిచేశారు. జూలై 1 నుంచి 31 వరకు ఈ బృందాలు జిల్లాలోని హోటళ్లు, లాడ్జీలు, ఇటుక బట్టీలు, రైల్వే స్టేషన్ తదితర ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలోని మూడు డివిజన్లలో మొత్తం 154 మంది గుర్తించగా 148 మంది బాలుర, 6 మంది బాలికలను విముక్తి చేశారు. నిజామాబాద్ పరిధిలో 15, ఆర్మూర్‌లో 12, బోధన్‌లో 9 కేసులు నమోదు చేశారు. తప్పిపోయిన పిల్లల వివరాలను 'దర్పణ్ యాప్'లో నమోదు చేసి, వారి అడ్రస్‌లను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు. నిజామాబాద్ సబ్ డివిజన్ పరిధిలో 56 మంది, బోధన్‌లో 56 మంది, ఆర్మూర్‌లో 42 మందిని గుర్తించారు. తప్పిపోయిన చిన్నారులను సైతం అక్కున చేర్చుకున్నారు. కౌన్సెలింగ్ నిర్వహించి కొందరిని తల్లిదండ్రులకు అప్పగించగా, మరికొందరిని రిహాబిలిటేషన్ సెంటర్‌కు తరలించారు.

ఆపరేషన్ స్మైల్, ముస్కాన్ వివరాలు

సంవత్సరం	గుర్తించిన బాలకార్మికులు	తల్లిదండ్రుల చెంతకు	రిహాబిలిటేషన్ సెంటర్‌కు
2022	65	65	-
2023	98	94	04
2024	139	136	03
2025	154	118	36



కొన్ని రోజులకే యథాస్థితికి..

జనవరిలో ఆపరేషన్ స్మైల్, జూలైలో ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమం నిర్వహించిన కొన్ని రోజులకే యథాస్థితికి చేరుకుంటుందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆరు నెలలకోసారి నిర్వహించే ఈ కార్యక్రమాల్లో గుర్తించిన పిల్లలను తల్లిదండ్రులు తమ కుటుంబ అవసరాలకు మళ్లీ పనుల్లో చేరుస్తున్నారు. నిరంతరం కార్యక్రమాన్ని కొనసాగిస్తే పిల్లల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయవచ్చని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

“ పనిలో పెట్టుకోవద్దు



చిన్నారులను పనిలో పెట్టుకోవద్దు. పిల్లలతో పని చేయిస్తే యజమానులపై చర్యలు తీసుకుంటాం. ఎక్కడైనా మైనర్లను పనిలో పెట్టుకున్నట్లు సమాచారం అందిస్తే తనిఖీలు చేపడ్తాం. ఆపరేషన్ ముస్కాన్, ఆపరేషన్ స్మైల్ కార్యక్రమాల ద్వారా తప్పిపోయిన, బందిలుగా మారిన చిన్నారులకు విముక్తి కలిగిస్తాం.

– సాయిచైతన్య, సీపీ, నిజామాబాద్

'జనహిత'కు సర్వం సిద్ధం

- నేడు ఆర్మూర్‌లో ఏఐసీసీ ఇంచార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ పాదయాత్ర
- ఆదివారం శ్రమదానం.. నాయకులతో సమావేశం



ఆర్మూర్ నాయకులతో సమావేశమైన ఎమ్మెల్సీ బల్మూరి, కాంగ్రెస్ నేతలు మానాల, వినయ్‌రెడ్డి

ఆర్మూర్: ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ జనహిత పాదయాత్రకు సర్వం సిద్ధమైంది.

■ రెండ్రోజుల పర్యటనలో భాగంగా ఆర్మూర్ నియోజకవర్గం ఆలూర్ మండల కేంద్రానికి శనివారం సాయంత్రం 4 గంటలకు చేరుకోనున్నారు. అక్కడి నుంచి గగ్గుపల్లి, ఇస్సాపల్లి, ఆర్మూర్ పట్టణంలోని గోల్ బంగ్లా మీదుగా పాత బస్టాండ్ వరకు పాదయాత్ర చేపట్టనున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి ఫలాలు లబ్ధిదారులకు చేరుతున్నాయా? లేదా? అనే విషయాన్ని స్వయంగా ప్రజలను కలిసి అడిగి తెలుసుకోనున్నారు. అనంతరం మాజీ ఎంపీపీ పీసీ ఉషారాణి భోజన్న ఇంట్లో బస చేస్తారు.

■ ఆదివారం ఉదయం 9 గంటలకు పట్టణంలోని గోల్‌బంగ్లా నుంచి పోచమ్మ మందిరం కమాన్ వరకు శ్రమదానం చేస్తారు. హౌసింగ్ బోర్డు కాలనీలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులతో మాట్లాడి కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటుతారు. అర్గుల్ శివారులోని యమున గార్డెన్స్‌లో జిల్లాలోని కాంగ్రెస్ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహిస్తారు. పాదయాత్ర రూట్ మ్యాప్‌ను సీపీ సాయి చైతన్య, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు.

నేనొచ్చి క్లీన్ చేయాలా?

- పంచాయతీ కార్యదర్శిపై కలెక్టర్ సీరియస్
- నవీపేటలో ప్రభుత్వ కార్యాలయాలను తనిఖీ చేసిన వినయ్ కృష్ణారెడ్డి



నవీపేట ఆస్పత్రి వైద్యులతో మాట్లాడుతున్న కలెక్టర్

నవీపేట: పాఠశాల ఆవరణను శుభ్రంగా ఉంచాలని తెలియదా? నేనొచ్చి క్లీన్ చేయాలా? అంటూ నవీపేట పంచాయతీ కార్యదర్శిపై కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. నవీపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలను శుక్రవారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మొదట ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. మందుల కొరత లేకుండా చూడాలని ఆదేశించారు. అనంతరం దర్యాపూర్ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసి అక్కడ వంటశాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజన నిర్వాహకులతో మాట్లాడి మెనూ వివరాలను తెలుసుకున్నారు. ఆవరణలో చుట్టుపక్కల వాసులు చెత్తను పారేయడంతో జీపీ కార్యదర్శి రవీందర్ నాయక్‌ను మందలించారు. అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించి చిన్నారుల వివరాలను తెలుసుకున్నారు. నవీపేట ప్రాథమిక పాఠశాలలోని మరుగుదొడ్లు, బాత్‌రూమ్‌లను పరిశీలించారు. సొసైటీ, పశు వైద్యశాల, తహసీల్ కార్యాలయాన్ని తనిఖీ చేసి భూభారతిపై అధికారులతో సమీక్షించారు. రెవెన్యూ సమస్యలను పెండింగ్‌లో ఉంచొద్దన్నారు.

క్లుప్తంగా

ఎస్సారెస్పీలోకి 5,276 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బాల్కొండ: శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌లోకి మహారాష్ట్ర ప్రాంతం నుంచి 5, 276 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్ట్‌ నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. కాకతీయ కాలువ ద్వారా 100, మిషన్‌ భగీరథ ద్వారా 231 క్యూసెక్కుల నీరు విడుదలవుతుంది. ఆవిరి రూపంలో 443 క్యూసెక్కులు తగ్గుతోంది. ప్రాజెక్ట్‌ పూర్తిస్థాయి నీటిమట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా శుక్రవారం సాయంత్రానికి 1077.70(39 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని అధికారులు తెలిపారు.

మెడికవర్‌ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ ట్రస్టు తనిఖీలు



నిజామాబాద్‌నాగారం: జిల్లా కేంద్రంలోని ఎల్లమ్మగుట్టలోగల మెడికవర్‌ ఆస్పత్రిని శుక్రవారం ఆరోగ్యశ్రీ ట్రస్టు అధికారులు తనిఖీ చేశారు. ఆరోగ్యశ్రీ జీఎం డా.రాంబాబు నాయక్‌ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ ట్రస్టు సేవలు ఎలా అందుతున్నాయని రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో ఆరోగ్య శ్రీలో జరుగుతున్న వైద్యంలో ఎవరైనా డబ్బులు అడుగుతున్నారా అని రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో ఆరోగ్య శ్రీ సేవల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. డిప్యూటీ ఈవో శ్రీనివాస్‌, చంద్రశేఖర్‌, మేనేజర్‌ సత్యనారాయణ, ఆస్పత్రి వైద్యులు ఉన్నారు.

లక్ష్మారెడ్డి సేవలు మరువలేనివి



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్‌: రుద్రూర్‌ మండల పంచాయతీ అధికారిగా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన పాతూరి లక్ష్మారెడ్డి సేవలు మరువలేనివని రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నగరంలోని బీఎల్‌ఎన్‌ గార్డెన్స్‌లో శుక్రవారం లక్ష్మారెడ్డికి వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి పోచారం ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. లక్ష్మారెడ్డి తన సేవలను ప్రజలకు సాధ్యమైనంత ఎక్కువగా అందించేవిధంగా పనిచేశారన్నారు. తనకు వ్యక్తిగత సహాయకుడిగా సుదీర్ఘకాలం సేవలందించారన్నారు. నిత్యం చెరగని చిరునవ్వుతో అలుపు లేకుండా పనిచేసిన లక్ష్మారెడ్డి నుంచి తాను కూడా చాలా విషయాలు నేర్చున్నానన్నారు. అనంతరం లక్ష్మారెడ్డి దంపతులను ఆయన సన్మానించారు. నుడా చైర్మన్‌ కేశవేణు, రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్‌ చైర్మన్‌ కాసుల బాలరాజు, డీసీసీబీ మాజీ చైర్మన్‌ పోచారం భాస్కర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా అండర్‌ బ్రిడ్జిలు

- నిర్వహణ గాలికి..
- వెలగని లైట్లు.. నిలుస్తున్న వర్షపు నీరు
- ఉమ్మడి జిల్లాలో ఎన్‌హెచ్‌ 44 అనుబంధంగా 10 అండర్‌ బ్రిడ్జిలు
- 46 వరకు చిన్న బ్రిడ్జిలు



చాంద్‌మియాబాగ్‌ అండర్‌ బ్రిడ్జి వద్ద నిలిచిన వర్షపునీరు



బురదమయమైన జక్రాన్‌పల్లి మండల కేంద్రంలోని అండర్‌ బ్రిడ్జి

జక్రాన్‌పల్లి(నిజామాబాద్‌రూరల్‌): ఉమ్మడి జిల్లా పరిధిలో జాతీయ రహదారి 44కు అనుబంధంగా నిర్మించిన అండర్‌ బ్రిడ్జిల నిర్వహణను గాలికి వది లేశారు. సుమారు 85 కిలోమీటర్ల మేర ఉన్న హైవే పై పెద్ద అండర్‌ బ్రిడ్జీలు 10, చిన్న బ్రిడ్జీలు 46వరకు ఉన్నాయి. నిర్మాణ డిజైన్‌లో లోపానికి తోడు నిర్వ హణ అస్తవ్యస్తంగా మారడంతో గ్రామీణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. లైట్లు వెలగకపోయినా, వర్షపునీరు నిలుస్తున్నా పర్యవేక్షించాల్సిన జాతీయ రహదారుల సంస్థ అధికారులు పట్టించుకోవడం లేదు. ఉమ్మడి జిల్లా పరిధిలోని పోచంపాడ్‌ నుంచి అడ్లూర్‌ ఎల్లారెడ్డి వరకు అండర్‌ బ్రిడ్జీలతో 76 గ్రామాలు అనుసంధానమై ఉన్నాయి. 15ఏళ్ల పాటు రోడ్డు మరమ్మతులతో పాటు అండర్‌ బ్రిడ్జిలు, సర్వీసు రోడ్ల నిర్వహణ బాధ్యత సదరు కాంట్రాక్ట్‌ సంస్థదే. అయితే అండర్‌ బ్రిడ్జిల లోపల కూడా లైట్లు సరిగా వెలగకపోవడంతో వాహనదారులు భయపడుతున్నారు.



చాంద్‌మియా బాగ్‌ వద్ద సర్వీసురోడ్డుపై నిలిచిన వర్షపునీరు



సికింద్రాపూర్‌ వద్ద అండర్‌ బ్రిడ్జి

నిర్మాణంలో లోపాలు

జాతీయ రహదారి నిర్మాణ సమయంలోనే అనేక లోపాలు బయటపడ్డాయి. డిచ్‌పల్లి మండలం సాంపల్లి, బాల్కొండ మండలం శ్రీరాంపూర్‌, ఇందల్వాయి మండల కేంద్రంలో, సదాశివనగర్‌లో ఒకటి, జక్రాన్‌పల్లి, చాంద్‌మియాబాగ్‌ ప్రాంతాల్లో అండర్‌ బ్రిడ్జిలు ఉన్నాయి. కొన్ని చోట్ల అండర్‌ బ్రిడ్జిలు లేక ఒక పక్క నుంచి మరో పక్కకు తిరిగి రావాల్సిన పరిస్థితి నెలకొంది. వానాకాలంలో బీబీపూర్‌ తండా వద్ద నిర్మించిన సర్వీసు రోడ్డు పక్కన ఉన్న చెరువు నీరు చేరి ప్రయాణికులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. బ్రిడ్జిల నిర్మాణంలో లోపాల కారణంగా పెద్ద వాహనాలు వెళ్లేందుకు వీలు లేకుండా ఉంది. అండర్‌ బ్రిడ్జిల నిర్మాణంలో లోపాల కారణంగా వర్షం కురిసినప్పుడు జాతీయ రహదారిపై నుంచి నీరు బ్రిడ్జి కిందకు చేరుతోంది.

జక్రాన్‌పల్లిలో నాలుగు..

జక్రాన్‌పల్లి మండల కేంద్రంతోపాటు చాంద్‌మియాబాగ్‌, సికింద్రాపూర్‌, అర్గుల్‌ గ్రామాల్లో నాలుగు అండర్‌ బ్రిడ్జిలు ఉన్నాయి. ఆయా గ్రామాల ప్రజలు బ్రిడ్జి కింద నుంచి నడిచి వెళ్లలేని పరిస్థితి ఉంది. చాంద్‌మియాబాగ్‌ బ్రిడ్జి కింద నుంచి పడకల్‌, కలిగోట్‌, చింతలూర్‌ గ్రామాల ప్రజలు ప్రయాణిస్తూ ఉంటారు. జక్రాన్‌పల్లి బ్రిడ్జి నుంచి మనోహరాబాద్‌, కొలిప్యాక్‌, సికింద్రాపూర్‌ బ్రిడ్జి నుంచి కేశ్‌పల్లి గ్రామస్తులు వెళ్తుంటారు. బ్రిడ్జి కింద నుంచి వెళ్లాలంటేనే వాహనదారులు జంకుతున్నారు.

అవస్థలు పడుతున్నాం



చాంద్‌మియాబాగ్‌ వద్ద జాతీయ రహదారిపై నిర్మించిన అండర్‌ బ్రిడ్జి కింద వర్షపు నీరు నిలవడంతో ప్రయాణానికి ఆటంకం కలుగుతోంది. బ్రిడ్జి కింద బురద నీటిలో ప్రయాణించాలంటే వాహనదారులు అనేక అవస్థలు పడాల్సి వస్తోంది. బ్రిడ్జి కింద నీరు నిల్వ ఉండకుండా చేసి వాహనదారుల ఇబ్బందులు తొలగించాలి. – కోటేశ్వర్‌, పడకల్‌

గుత్తేదారుల నిర్లక్ష్యం వల్లే ఇబ్బందులు



జాతీయ రహదారిపై నిర్మించిన అండర్‌ బ్రిడ్జిలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. అంతేకాక సర్వీసు రోడ్ల నిర్వహణ సరిగా లేదు. గుత్తేదారుల నిర్లక్ష్యం వల్లే వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైన సంబంధిత రోడ్లు నిర్వహణ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి. వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి. – అంకం నరేశ్‌, టీచర్‌, పడకల్‌

బ్రిడ్జి కింద నుంచి దాటలేకపోతున్నాం



జక్రాన్‌పల్లి బ్రిడ్జి కింద వర్షపు నీరు నిల్వ ఉంది. దీంతో రోడ్డు దాటలేకపోతున్నాం. నీటిలో ఎక్కడ గుంత ఉందో తెలియని పరిస్థితి ఉంది. దీంతో బ్రిడ్జి కింద నుంచి అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి ఉంది. ఎవరు కూడ నడవలేకపోతున్నారు. వర్షపు నీరు నిల్వ ఉండకుండా చేసి ప్రజల ఇబ్బందులు తొలగించాలి. – తలారి సతీష్‌, జక్రాన్‌పల్లి

ఏడేళ్లుగా మూసిఉన్న సబ్‌ జైళ్లు

మీకు తెలుసా?



ఆర్మూర్‌ పట్టణంలో మూసి వేసిన సబ్‌ జైలు

ఆర్మూర్‌: 2018 జనవరిలో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఐదు సబ్‌ జైళ్లను తాత్కాలికంగా మూసి వేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేయగా అందులో జిల్లాలోని ఆర్మూర్‌, బోధన్‌ సబ్‌ జైళ్లు ఉన్నాయి.

- నిజామాబాద్‌ జిల్లాలోని ఆర్మూర్‌, బోధన్‌ సబ్‌ జైళ్లతో పాటు వరంగల్‌ జిల్లాలోని నర్సంపేట, పరకాల, ఖమ్మం జిల్లాలోని మదిర సబ్‌ జైళ్లను నిర్వహణ భారం కారణంగా మూసి వేస్తూ అప్పటి జైళ్ల శాఖ జీవో జారీ చేసింది.
- ఆర్మూర్‌ పట్టణంలో అసిస్టెంట్‌ సీనియర్‌ సివిల్‌ కోర్టు (ఫాస్ట్రాక్‌ కోర్టు), జ్యుడీషియల్‌ ఫస్ట్‌క్లాస్‌ కోర్టు, అడిషనల్‌ జ్యుడీషియల్‌ ఫస్ట్‌ క్లాస్‌ కోర్టులు ఉన్నాయి.
- ఆర్మూర్‌ డివిజన్‌ పరిధిలోని ఆర్మూర్‌, ఆలూర్‌, నందిపేట, డొంకేశ్వర్‌, జక్రాన్‌పల్లి, బాల్కొండ, మెండోర, ముప్కాల్‌, వేల్పూర్‌, మోర్తాడ్‌, ఏర్గట్ల, కమ్మర్‌పల్లి, భీమ్‌గల్‌, సిరికొండ మండలాల పోలీస్‌ స్టేషన్ల పరిధిలోని కేసులను ఇక్కడ విచారిస్తారు.
- కాగా విచారణలో భాగంగా నిందితులుగా ఉన్న రిమాండ్‌ ఖైదీలను ఆర్మూర్‌ సబ్‌ జైలులో బంధించేవారు. శిక్షలు ఖరారు అయిన అనంతరం వారిని జిల్లా జైలుకు తరలించేవారు.
- కానీ ఆర్మూర్‌తో పాటు బోధన్‌ సబ్‌ జైలును ఎత్తివేయడంతో రిమాండ్‌ ఖైదీలను సైతం జిల్లా కేంద్రానికి తరలించాల్సిన పరిస్థితి తలెత్తింది. దీంతో ఖైదీలను కోర్టుకు తరలించే బాధ్యత నిర్వహించే పోలీసులపై మరింత పనిభారం పడింది.

రైళ్లల్లో ఉండే కోచ్‌లు

సమాచారం..



ఖలీల్‌వాడి: రైళ్లలో ప్రయాణించేటప్పుడు స్లీపర్‌, ఏసీ, జనరల్‌ బోగీల గురించి అందరికీ తెలిసే ఉంటుంది. కానీ ఏసీలో కూడా చాలా రకాలు ఉంటాయి. అందులో 1ఏ, 2ఏ, 3ఏ తరగతులతోపాటు ఇటీవల కొన్ని రైళ్లలో 3ఈ, ఈఏ వంటివి వందేభారత్‌ రైళ్లలో ఈసీ, సీసీ వంటి తరగతులు కూడా అప్పుడప్పుడు కనిపిస్తుంటాయి. ఒక్కో తరగతి(బెర్త్‌) టిక్కెట్‌ ఛార్జీ ఒక్కో రకంగా ఉంటుంది.

- **యూఆర్‌:** అన్‌ రిజర్వ్‌ పిలిచే కోచ్‌లను సెకండ్‌ క్లాస్‌ అంటారు. రిజర్వేషన్‌ లేకుండానే అప్పటికప్పుడు టిక్కెట్‌ తీసుకొని రైళ్లలో ప్రయాణించడానికి అవకాశం ఉంటుంది.
- **స్లీపర్‌ క్లాస్‌:** తక్కువ ఖర్చుతో దూర ప్రయాణం చేసే వారు స్లీపర్‌ క్లాస్‌ టిక్కెట్‌ను ఎంచుకుంటారు. ఇవి నాన్‌- ఏసీ కోచ్‌. ఈ క్యాబిన్‌లో 8 బెర్తులు ఉంటాయి.
- **సెకండ్‌ సిట్టింగ్‌:** స్లీపర్‌ క్లాస్‌ తర్వాత రిజర్వేషన్‌ చేసుకునే అవకాశం సెకండ్‌ సిట్టింగ్‌ కోచ్‌లో ఉంటుంది. కొన్ని రైళ్లలో మాత్రమే ఇవి అందుబాటులో ఉంటాయి.
- **1ఏ:** ఫస్ట్‌ క్లాస్‌ ఏసీ స్లీపర్‌ను 1ఏ గా పిలుస్తారు. ఇందులో సైడ్‌ బెర్తులు లేకుండా రెండు లేదా నాలుగు బెర్తులు ఉంటాయి. రెండు బెర్తు ఉంటే కూప్‌ అని, 4 బెర్తులు ఉంటే క్యాబిన్‌గా పిలుస్తారు.
- **2ఏ:** దీనిని సెకండ్‌ ఏసీ, టూ టైర్‌ ఏసీ అని పిలుస్తారు. ఇందులో ఉండే క్యాబిన్‌ ఆరు సీట్లు ఉంటాయి. మిడిల్‌ బెర్తులు ఉండవు.
- **3ఏ:** మధ్యతరగతి ప్రజల కోసం ఉండే ఏసీ కోచ్‌ ఇది. స్లీపర్‌ క్లాస్‌ లాగే ఉండగా ఏసీ అదనంగా ఉంటుంది.
- **3ఈ:** థర్డ్‌ ఎకానమీగా పిలిచే ఈ కోచ్‌లు ఎక్కువగా గరీబ్‌రథ్‌, ఫలక్‌నామా రైళ్లలో కనిపిస్తుంటాయి. థర్డ్‌ ఏసీ కంటే తక్కువ ఛార్జీలు ఉంటాయి.
- **ఈఏ:** ఎగ్జిక్యూటివ్‌ అనుభూతిగా పిలిచే కోచ్‌లు శతాబ్ది రైళ్లలో అందుబాటులో ఉంటాయి. ఏసీతో కూడిన కుర్చీలు ఉంటాయి. ఇందులో సినిమాలు, సంగీతాన్ని వినడానికి ఎల్‌ఈడీ టీవీలు ఉంటాయి
- **ఈసీ:** ఎగ్జిక్యూటివ్‌ క్లాస్‌గా పిలిచే తరగతిలో ఏసీతో కూడిన సీట్లు ఉంటాయి. బెర్తులు ఉండవు. ఇవి వందే భారత్‌ రైళ్లలో అందుబాటులో ఉన్నాయి.
- **సీసీ:** ఏసీ చైర్‌కార్‌గా పిలిచే పగటి పూట ప్రయాణించే రైళ్లలో ఈ తరగతి అవకాశం ఉంటుంది. వందేభారత్‌ రైళ్లలో ఇది అందుబాటులో ఉంది.
- **విస్టాడోమ్‌:** పర్యాటక ప్రాంతాల్లో నడిచే రైళ్లలో అద్దాలతో నిర్మితమై ఉంటాయి.

డివిడెండ్‌తో పీఏసీఎస్‌లకు పునర్‌వైభవం



ఎన్‌డీసీసీబీ చైర్మన్‌ రమేష్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సొసైటీల యూనియన్‌ నాయకులు

సుభాష్‌నగర్‌: ఎన్‌డీసీసీబీ ద్వారా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు విడుదల చేసిన డివిడెండ్‌తో పునర్‌వైభవం రానుందని ఉమ్మడి జిల్లా సహకార సంఘాల యూనియన్‌ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు దయాసాగర్‌, నర్సయ్య అన్నారు. ఇటీవల జరిగిన ఎన్‌డీసీసీబీ 103వ వార్షిక మహాజనలో చైర్మన్‌ రమేష్‌రెడ్డి డివిడెంట్‌ ప్రకటించి, ఖాతాల్లో జమ చేశారు. ఈసందర్భంగా వారు శుక్రవారం నగరంలోని కార్యాలయంలో చైర్మన్‌ రమేష్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి, సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పదేళ్లలో ఎన్నడూలేని విధంగా సహకార సంఘాలకు చైర్మన్‌ డివిడెంట్‌ ప్రకటించారని, ఇదే వారి పనితీరుకు నిదర్శమన్నారు. వారి నాయకత్వంలో మరిన్ని మైలురాళ్లు చేరుకుంటామని ఆశాభావం వ్యక్తంచేశారు. వైస్‌ చైర్మన్‌ నల్ల చంద్రశేఖర్‌రెడ్డి, డైరెక్టర్లు గోర్కంటి లింగన్న, రమేష్‌ పాటిల్‌, సీఈఓ నాగభూషణం వందే, యూనియన్‌ నాయకులు వంశీ, మోహిత్‌ పాష, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి పనులపై దిశానిర్దేశం

- మండలాల వారీగా అధికారులతో సమీక్ష నిర్వహించిన కలెక్టర్‌ వినయ్‌ కృష్ణారెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్‌ వినయ్‌ కృష్ణారెడ్డి

నిజామాబాద్‌అర్బన్‌ : నిర్దేశిత లక్ష్యాల సాధన కోసం అధికారులు అంకిత భావంతో కృషి చేయాలని కలెక్టర్‌ టీ వినయ్‌ కృష్ణారెడ్డి సూచించారు. కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో శుక్రవారం అదనపు కలెక్టర్లు అంకిత్‌, కిరణ్‌ కుమార్‌లతో కలిసి అన్ని శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్‌ సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల ప్రగతిపై మండలాల వారీగా చర్చిస్తూ, అధికారులకు దిశానిర్దేశం చేశారు. వివిధ శాఖల ద్వారా అమలవుతున్న కార్యక్రమాలు సజావుగా జరిగేలా సంబంధిత శాఖల జిల్లా అధికారులతో పాటు మండల స్పెషల్‌ ఆఫీసర్లు పర్యవేక్షణ జరపాలని కలెక్టర్‌ ఆదేశించారు. పాఠశాలలు, రెసిడెన్షియల్‌ స్కూల్స్‌, హాస్టళ్లు, అంగన్‌వాడీ, ఆసుపత్రులు వంటి వాటికి సంబంధించిన అసంపూర్తి భవనాలను గుర్తించి, యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టి పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ బడులలో తాగునీరు, మరుగుదొడ్లు వంటి మౌలిక సదుపాయాలను గుర్తిస్తూ, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా ప్రతిపాదనలు సమర్పించేలా చూడాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తూ, నిరంతర పర్యవేక్షణ జరపాలని కలెక్టర్‌ ఆదేశించారు. ఇంటి నిర్మాణానికి ఆసక్తి చూపని లబ్ధిదారుల నుంచి రాతపూర్వకంగా లేఖలు తీసుకోవాలని, వారి స్థానంలో అర్హులైన ఇతరులకు కేటాయించాలని కలెక్టర్‌ సూచించారు. నియోజకవర్గాలలో నిర్మించిన డబుల్‌ బెడ్‌ రూమ్‌ ఇళ్లను ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా అర్హులైన వారికి కేటాయించాలని తెలిపారు. ఎక్కడైనా ఎరువులను దారి మళ్లించినట్లు తెలిస్తే రైతులు, ప్రజలు టోల్‌ ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేసేలా సూచించాలని అన్నారు. వర్షాకాలంలో సీజనల్‌ వ్యాధులు సోకకుండా ముందు జాగ్రత్తలు చేపట్టాలని, పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా జరిగేలా చూడాలన్నారు. రేషన్‌కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అయినందున, కొత్త కార్డులు, సభ్యుల పేర్ల నమోదు కోసం వచ్చే దరఖాస్తులను వెనువెంటనే పరిశీలించాలన్నారు. వన మహోత్సవంలో భాగంగా ఆయా శాఖలకు కేటాయించిన మొక్కలు నాటే లక్ష్యాన్ని పూర్తిస్థాయిలో సాధించాలని అన్నారు. సమీక్షా సమావేశంలో ట్రెయినీ కలెక్టర్‌ కరోలినా చింగ్తియాన్‌ మావీ, నగర పాలక సంస్థ కమిషనర్‌ దిలీప్‌ కుమార్‌, అధికారులు పాల్గొన్నారు.

14 నుంచి బీఈడీ, బీపీఈడీ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని బీఈడీ, బీపీఈడీ (బ్యాచ్‌లర్‌ ఆఫ్‌ ఫిజికల్‌ ఎడ్యుకేషన్‌) 2, 4 వ సెమిస్టర్‌ రెగ్యులర్‌, 1, 3వ సెమిస్టర్‌ బ్యాక్‌లాగ్‌ (2021 బ్యాచ్‌ నుంచి) పరీక్షలు ఈ నెల 14 నుంచి ప్రారంభమవుతాయని కంట్రోలర్‌ ప్రొఫెసర్‌ కే సంపత్‌కుమార్‌ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు తెలంగాణ యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలని అన్నారు.

రీవాల్యుయేషన్‌ దరఖాస్తు గడువు పొడిగింపు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ పున:మూల్యాంకన (రీవాల్యుయేషన్‌) దరఖాస్తులను ఈ నెల 5 వరకు పొడిగించినట్లు కంట్రోలర్‌ ప్రొఫెసర్‌ కే సంపత్‌కుమార్‌ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు తెయూ పరిధిలో మే 2025లో జరిగిన డిగ్రీ 2, 4, 6వ సెమిస్టర్‌ (రెగ్యులర్‌), 1, 3, 5వ సెమిస్టర్‌ బ్యాక్‌లాగ్‌ పరీక్షలకు సంబంధించి రీవాల్యుయేషన్‌ కోసం విద్యార్థులు సంబంధిత కళాశాల ద్వారా దరఖాస్తు ఫారాలు పొందవచ్చన్నారు. దరఖాస్తుతోపాటు మెమో జిరాక్స్‌ జతచేసి సమర్పించాలన్నారు. రీవాల్యుయేషన్‌ ఫీజు ఒక్కో పేపర్‌కు రూ.500లతోపాటు రూ.100 అపరాధ రుసుము, దరఖాస్తు ఫారం రూ.25 చెల్లించాల్సి ఉంటుందని కంట్రోలర్‌ సంపత్‌కుమార్‌ తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌ రూరల్‌: ప్రైడ్‌ ఆఫ్‌ ఇండియా, ఐకాన్‌ ఆఫ్‌ ఇండియా–2025 జాతీయ స్థాయి పురస్కారాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు హైదరాబాద్‌కు చెందిన ఆల్‌ ది బెస్ట్‌ ఆర్ట్స్‌ అకాడమీ (సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ) వ్యవస్థాపకుడు డాక్టర్‌ ఈఎస్‌ఎస్‌ నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. సమాజసేవ, పర్యావరణ పరిరక్షణ, విద్యా, వైద్యం, సాహిత్యం, కళలు, క్రీడా తదితర రంగాల్లో సేవలందిస్తున్న వారు పురస్కారాల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. సేవలు, ప్రతిభను తెలియజేసే సర్టిఫికెట్లు, ఫొటోలు, పత్రికల క్లిప్పింగ్స్‌తోపాటు ఫొటోలు జత చేసి ఈ నెల 10 లోపు ఆల్‌ ది బెస్ట్‌ ఆర్ట్స్‌ అకాడమీ, డోర్‌ నెం.1–20–164 గోకుల్‌ నగర్‌, వెంకటాపురం, తిరుమలగిరి, సికింద్రాబాద్‌–15కు పంపించాలని తెలిపారు. వివరాలకు 9652347207 నెంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

నేడు విద్యుత్‌ సరఫరాలో అంతరాయం

సుభాష్‌నగర్‌: నగరంలోని 11 కేవీ పులాంగ్‌ ఫీడర్‌ లైన్‌కు తగులుతున్న చెట్ల కొమ్మలను తొలగించేందుకు శనివారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని టౌన్‌–1 ఏడీఈ ఆర్‌ చంద్రశేఖర్‌ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాణా టవర్స్‌, అభ్యాస స్కూల్‌ ఏరియా, ఆకాశ్‌ అపార్ట్‌మెంట్‌, శివాలయం, కాకతీయ స్కూల్‌, ప్రగతినగర్‌, దేవి థియేటర్‌, పులాంగ్‌, వేణుమాల్‌, నిఖిల్‌ సాయి, వంశీ హోటల్‌ రోడ్‌, రైతుబజార్‌ తదితర ఏరియాల్లో విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఇంటర్‌ అడ్మిషన్ల గడువు పెంపు

నిజామాబాద్‌అర్బన్‌: జూనియర్‌ కాలేజీల్లో అడ్మిషన్ల గడువును రాష్ట్ర ఇంటర్‌ బోర్డు ఈ నెల 20 వరకు పొడిగించిందని జిల్లా ఇంటర్‌ విద్యాశాఖ అధికారి తిరుమలపుడి రవికుమార్‌ ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతిలో పాస్‌ అయిన ప్రతి విద్యార్థి జూనియర్‌ కళాశాలలో చేరేవిధంగా రాష్ట్ర ఇంటర్‌ బోర్డు మరో అవకాశం కల్పించిందన్నారు. ప్రభుత్వ జూనియర్‌ కళాశాలల ప్రిన్సిపాల్‌లు ఇది వరకే అడ్మిషన్‌ల ప్రక్రియపై పకడ్బందీగా పని చేస్తున్నారన్నారు. ఇంకా కళాశాలల్లో చేరని పదో తరగతి పాసైన విద్యార్థులను ఇంటర్‌లో చేర్పించేందుకు కృషి చేయాలని అధికారులను ఆదేశించారు.

క్రైం కార్నర్‌

పోలీసులమంటూ 7తులాల బంగారం చోరీ

బాల్కొండ: మండలంలోని చిట్టాపూర్‌ శివారులోని జాతీయ రహదారి 44పై నలుగురు వ్యక్తులు పోలీసులమంటూ చెబుతూ బంగారం చోరీకి పాల్పడ్డారు. బాధితులు తెలిపిన వివరాలు ఇలా.. ముప్కాల్‌ మండల కేంద్రానికి చెందిన లింగాపురం గంగారెడ్డి గురువారం మధ్యాహ్నం, ఏర్గట్లకు చెందిన తన మేనత్త కొప్పెల లింగవ్వను బైక్‌పై ఎక్కించుకోని శుభకార్యం నిమిత్తం పెర్కిట్‌కు బయలుదేరాడు. బాల్కొండ– చిట్టాపూర్‌ శివారులోని హైవేపై నల్గురు వ్యక్తులు వచ్చి వారి బైక్‌ను ఆపారు. తాము ఢిల్లీ పోలీసులమంటూ చెప్పారు. ప్రస్తుతం దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాని, బంగారు ఆభరణాలు ఎక్కువగా పెట్టుకోవద్దని సూచించారు. దీంతో లింగవ్వ మెడపై ఉన్న ఏడు తులాల బంగారంను తీస్తుండగా, వెంటనే వారు ఎత్తుకెళ్లారు. ఈమేరకు బాధితురాలు బాల్కొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

మాక్లూర్‌: మండలంలోని కృష్ణానగర్‌లో తాళం వేసిన ఓ ఇంట్లో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఎస్సై రాజశేఖర్‌ తెలిపిన వివరాలు ఇలా.. కృష్ణానగర్‌లోని యార్లగడ్డ ప్రసాద్‌ తన ఇంటికి తాళం వేసి కుటుంబసభ్యులతో కలిసి రెండురోజుల క్రితం ఊరికి వెళ్లాడు. శుక్రవారం ఉదయం అతడి ఇంటి తాళాలు పగలగొట్టి ఉండటంతో స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని, పరిసరాలను పరిశీలించారు. క్లూస్‌ టీంను తెప్పించి వేలిముద్రలు సేకరించారు. ఇంటి కుటుంబసభ్యులతో ఎస్సై ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. గుర్తుతెలియని దుండగులు ఇంటి తాళాలు పగులగొట్టి సుమారు రూ.20వేల నగదు, బైక్‌ను చోరీ చేసినట్లు తెలిపారు. బాధిత కుటుంబ సభ్యులు ఇంకా ఊరు నుంచి రాలేదని వారు వస్తే పూర్తి వివరాలు తెలుస్తాయని, ఎస్సై తెలిపారు.

ఎర్రాపహాడ్‌లో బైక్‌ దగ్ధం

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని ఎర్రాపహాడ్‌ గ్రామశివారులో బైక్‌ దగ్ధం అయినట్లు గ్రామస్తులు, బాధితుడు తెలిపారు. వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన చెవుటి రాజు అనేవ్యక్తి ప్రతిరోజు మాదిరిగానే గురువారం రాత్రి తన గొర్ల మంద వద్దకు బైక్‌పై వెళ్లాడు. అనంతరం బైక్‌ను కొద్ది దూరంలో ఉంచి అక్కడే నిద్రపోయాడు. శుక్రవారం ఉదయం నిద్ర నుంచి లేచి చూసేసరికి బైక్‌ పూర్తిగా దగ్ధమై ఉందని ఉందన్నారు. ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌ను దగ్ధం చేసి ఉండవచ్చన్నారు. బైక్‌ విలువ సుమారు రూ.70వేలు వరకు ఉంటుందని బాధితుడు తెలిపారు.

అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు

రుద్రూర్‌: భిక్షాటనకు వచ్చిన వ్యక్తి ఓ మహిళతో అసభ్యంగా ప్రవర్తించడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై సునీల్‌ తెలిపారు. వివరాలు ఇలా.. కోటగిరి మండలం అడ్కాస్‌పల్లి గ్రామానికి చెందిన అముల్‌ అనే వ్యక్తి శుక్రవారం భిక్షాటన కోసం కోటగిరికి వచ్చాడు. మండల కేంద్రంలో పర్యటిస్తూ ఒక ఇంటి వద్ద మహిళ చేయి పట్టుకుని అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో బాధితురాలు కోటగిరి పోలీస్‌ స్టేషన్‌ ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


సయోధ్య కుదిరేనా?

- ఆర్మూర్‌ కాంగ్రెస్‌లో సీనియర్‌, జూనియర్‌ నేతల మధ్య మనస్పర్థలు
- నేడు ఆర్మూర్‌ నియోజకవర్గంలో మీనాక్షి నటరాజన్‌ పర్యటన

ఆర్మూర్‌: ఆర్మూర్‌ నియోజకవర్గంలోని కాంగ్రెస్‌ పార్టీ సీనియర్‌, జూనియర్‌ నాయకుల మధ్య కొన్నాళ్లుగా అభిప్రాయ బేధాలున్నాయి. అసెంబ్లీ ఎన్నికల సమయంలో పొద్దుటూరి వినయ్‌రెడ్డి గెలుపు కోసం పనిచేసిన సీనియర్‌ నాయకులు ఎన్నికల అనంతరం ఆయనకు క్రమంగా దూరమయ్యారు. మొదటి నుంచి కాంగ్రెస్‌లో ఉన్న సీనియర్‌ నాయకులు వినయ్‌రెడ్డి అనుచరగణాన్ని జూనియర్లుగా భావిస్తుండటంతో మనస్పర్థలు ఏర్పడ్డాయి. కాంగ్రెస్‌లో ఉంటూ పీవీఆర్‌ పేరిట సొంత గ్రూప్‌ను ప్రోత్సహిస్తున్నాడని ఆరోపిస్తూ సీనియర్‌ నాయకులు పలుమార్లు మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డికి సైతం ఫిర్యాదు చేశారు. బీఆర్‌ఎస్‌ హయాంలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న నాయకులే కాంగ్రెస్‌లో చేరి వినయ్‌రెడ్డి ప్రధాన అనుచరులుగా కొనసాగడంపై ఆగ్రహంగా ఉన్నారు. ఆర్మూర్‌ నియోజకవర్గంలోని సీనియర్‌, జూనియర్‌ నాయకుల మధ్య సయోధ్య కుదుర్చడానికి జిల్లాలోని ముఖ్య నాయకులెవరూ ప్రయత్నాలు సైతం చేయకపోవడంతో నియోజకవర్గంలో రెండు గ్రూపులు కొనసాగుతున్నాయి. దీంతో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల్లో అర్హులైన లబ్ధిదారులు, పార్టీలోని కార్యకర్తలు ఏ నాయకుడి వద్దకు వెళ్లాలో అర్థం కాక తలలు పట్టుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితులతోనే గతంలోని బీఆర్‌ఎస్‌ నాయకుల తరహాలో కాంగ్రెస్‌ నాయకులను సైతం ప్రజలు ఛీత్కరించుకొనే పరిస్థితి వస్తుందంటూ సీనియర్‌ నాయకులు వాదించుకోవడం ప్రారంభించారు. ఇలాగే కొనసాగితే రానున్న పంచాయతీ, మున్సిపల్‌ ఎన్నికల్లో దీని ప్రభావం అధికంగా ఉండి కాంగ్రెస్‌ పార్టీ నష్టపోయే పరిస్థితి వస్తుందని పలువురు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈక్రమంలో ఆర్మూర్‌ నియోజకవర్గాన్నే తన పాదయాత్రకు ఎంచుకున్న మీనాక్షి నటరాజన్‌ పార్టీలోని ఈ రెండు గ్రూపుల మధ్య సయోధ్య కుదిర్చే ప్రయత్నం చేస్తుందని పార్టీలోని సాధారణ కార్యకర్తలు అభిప్రాయపడుతున్నారు.

ఉద్యమాలను గుర్తుచేస్తున్న ‘రైతాంగ పోరాట గళం’

- రాష్ట్ర సీడ్స్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌ అన్వేష్‌ రెడ్డి, రైతు జేఏసీ నాయకుడు ప్రభాకర్‌
- ఆర్మూర్‌లో పాటల సీడీ ఆవిష్కరణ



పాట సీడీని విడుదల చేస్తున్న అన్వేష్‌రెడ్డి

ఆర్మూర్‌: ఆర్మూర్‌ ప్రాంతంలో జరిగిన రైతు ఉద్యమాలను కళాకారుడు సుమన్‌ రచించి, పాడిన ‘రైతాంగ పోరాట గళం’ అనే పాట గుర్తుచేస్తోందని రాష్ట్ర సీడ్స్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌ అన్వేష్‌రెడ్డి, రైతు జేఏసీ నాయకుడు ప్రభాకర్‌ కొనియాడారు. పట్టణంలోని కుమార్‌ నారాయణ భవన్‌లో శుక్రవారం ‘రైతాంగ పోరాట గళం’ పాట సీడీ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. వారు ముఖ్య అతిథులుగా హాజరై, సీడీని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా ఆర్మూర్‌ ప్రాంత రైతులు పోరాటాలు చేస్తూ పోలీసు లాఠీ దెబ్బలు తినడమే కాకుండా అక్రమ కేసులతో జైలు జీవితాన్ని సైతం గడిపారన్నారు. ఎర్రజొన్నలకు గిట్టుబాటు ధర, పసుపు బోర్డు సాధించుకోవడంలో ఈ ప్రాంత రైతాంగం చేసిన ఉద్యమాలు చరిత్రలో నిలిచిపోతాయన్నారు. ఎర్రజొన్న, పసుపు బోర్డు ఉద్యమాల్లో రైతు నాయకులపై పెట్టిన కేసులను ఉపసంహరించాలని డిమాండ్‌ చేశారు. పాట చిత్రీకరణలో ప్రధాన పాత్ర పోషించిన రైతు నాయకుడు మంథని నవీన్‌రెడ్డి, డైరెక్టర్‌ చిట్టిబాబు, డీవోపీ సంజీవ్‌, నటులు సూరిబాబు, అనిల్‌ కుమార్‌, నిఖిల్‌, నరేందర్‌, మంథని గ్రామ ప్రజలను వారు అభినందించారు. నాయకులు మంథని గంగారాం, దేవరాం, కిషన్‌, ఆకుల గంగారాం, రాజన్న, తిరుపతిరెడ్డి, నారాయణరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, భరత్‌, దుర్గాప్రసాద్‌, రాజారెడ్డి ఉన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి



పెద్దకొడప్‌గల్‌(జుక్కల్‌): రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మండల కేంద్రంలోని జాతీయ రహదారి 161పై గల బ్రిడ్జి సైడ్‌వాల్‌ను ఇటుక లారీ గురువారం ఢీకొట్టడంతో ఘటన స్థలంలోనే ఒకరు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో గాయపడిన నాందేడ్‌కు చెందిన గణేష్‌ (20) నిజామాబాద్‌ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా శుక్రవారం తెల్లవారుజామున పరిస్థితి విషమించి మృతిచెందినట్లు ఎస్సై అరుణ్‌ కుమార్‌ తెలిపారు. ఘటన స్థలంలో పిట్లం మండలంలోని రూమ్‌తండాకు చెందిన నర్సింగ్‌ మృతి చెందగా, అతడి భార్య హాలవత్‌ సరిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

జక్రాన్‌పల్లి మండలంలో..



జక్రాన్‌పల్లి: పురుగుల మందు తాగిన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. వివరాలు ఇలా.. మండలంలోని అర్గుల్‌ గ్రామానికి చెందిన ద్యాగ రవి అనే రైతుకు ఇటీవల అదే గ్రామానికి చెందిన పొట్టి గంగారెడ్డి, తుమ్మల గంగారెడ్డి, సయ్యద్‌ ముహమ్మద్‌, శ్రీకాంత్‌ కలిసి మద్యం తాగించి, అతడి భూమిని వేరేవారి పేరుపై రిజిస్ట్రేషన్‌ చేయించారు. కొన్నిరోజుల తర్వాత విషయం తెలుసుకొని అతడు పంచాయితీ పెట్టించగా, వారు మరో భూమిని అతడికి రిజిస్ట్రేషన్‌ చేయించారు. కానీ మృతుడు తాను చేసిన తప్పును తలుచుకుంటూ మానసికంగా కృంగిపోయాడు. ఈక్రమంలో గత నెల 16న అతడు పురుగుల మందు తాగడంతో అనారోగ్యానికి గురయ్యాడు. కుటుంబ సభ్యులు అతడిని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించగా శుక్రవారం పరిస్థితి విషమించి మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మాలిక్‌ రెహ్మాన్‌ తెలిపారు.